క్లుప్తంగా

ఏఎన్‌ఎంలకు శిక్షణ



ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇస్తున్న డా. మనోజ్ చంద్ర

పుల్లంపేట : హిమోగ్లోబీన్‌పై ఏఎన్‌ఎంలకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ మనోజ్ చంద్ర పేర్కొన్నారు. గర్భిణులలో రక్తం వృద్ధి చెందేందుకు ఐరన్ మాత్రలు, సూది మందు ఎలా ఇవ్వాలో తెలియజేశారు. గర్భిణులు ప్రతి ఒక్కరూ పౌష్టిక ఆహారం తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఓ రాజా, సూపర్‌వైజర్ హరి, కుమారి, శివగౌరి పాల్గొన్నారు.

నల్లగంగమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు చేసినట్లు ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ మునగా మురళీస్వామి, ఆలయ ఈఓ కొండారెడ్డిలు తెలిపారు. హుండీ లెక్కింపు ద్వారా రూ.2,46,325 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో మట్లి బాలికకు గోల్డ్ మెడల్



దేవరింటి ప్రసన్న

వీరబల్లె (రాయచోటి టౌన్) : ఈనెల 20వ తేదీ తెనాలిలో నిర్వహించిన 10వ పవర్ లిఫ్టింగ్ జూనియర్ బాలికల విభాగంలో మట్లి తొగటపల్లెకు చెందిన దేవరింగి ప్రసన్న గోల్డ్ మెడల్ సాధించింది. ఈ మేరకు గురువారం ఆ బాలికను ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మోడం నాగభూషణం అభినందించారు. విద్యార్థి మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

కొత్తపురమ్మకు ప్రత్యేక పూజలు



సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో వెలిసిన కొత్తపురమ్మకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



గంగమ్మను గుడికి తీసుకువస్తున్న దృశ్యం

చిట్వేలి : కేఎస్ అగ్రహారంలో బుధవారం ప్రారంభమైన గంగమ్మతల్లి జాతర గురువారం సాయంత్రం ప్రశాంతంగా ముగిసింది. గురువారం తెల్లవారజామున బయలుదేరిన గంగమ్మకు అడుగడుగునా భక్తులు హారతులు స్వీకరిస్తూ ఉదయం 10 గంటలకు గుడికి చేరుకోగానే జంతు బలులు అర్పించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఎల్‌వీ మోహన్‌రెడ్డి, ఎంపీపీ చంద్రలు గంగమ్మను దర్శించుకున్నారు. సీఐ విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్, పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం గుడిచుట్టు ప్రదక్షణలు చేసిన పందేరపు బండ్లు భక్తులను అలరించాయి.

రోజూ పుస్తక పఠనం చేయాలి

సిద్దవటం : ప్రతి విద్యార్థి రోజూ పుస్తక పఠనం చేయాలని సిద్దవటం గ్రంథాలయ అధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. సిద్దవటం గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపునకు గురువారం 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటగా పిల్లలతో పుస్తక పఠనం, ధ్యానం, నీతి పద్యాలు చెప్పించినట్లు పేర్కొన్నారు. చిన్నారులతో మ్యూజికల్ చైర్స్ పోటీలు, క్యారం బోర్డు, చెస్, లూడో ఆటలు ఆడించామన్నారు.
చిన్నమండెం : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయ నిర్వాహకుడు ఆంజనేయరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో విద్యార్థులు కథలు చదవడం, యోగా, ఆటల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లు 'వలంటీర్లు'



లక్కిరెడ్డిపల్లె: వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు



చిన్నమండెం: వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథ్‌రెడ్డిలు

లక్కిరెడ్డిపల్లె : ప్రజల కోసం పరితపించే చేతల ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలో జరిగిన సచివాలయ వలంటీర్లకు పురస్కారాల ప్రధానంలో ముఖ్య అతిథిగా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రథసారథులు, వారధులు, గ్రామ, వార్డు వలంటీర్లు అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న 25 రకాల సంక్షేమ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లు వలంటీర్లు అని తెలిపారు. సీఎం జగన్ తెచ్చిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ వ్యవస్థతో ప్రతి ఇంట్లో మంచి జరిగిందన్నారు.

ప్రతిపక్షాల కుట్రలు, విమర్శలను తిప్పికొట్టాలి

బడుగు, బలహీనవర్గాల నాయకుడిగా గొప్పపేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న సీఎం జగన్‌పై గుంట నక్కలు, తోడేళ్లు ఏకమై తప్పుడు ప్రచారం చేస్తున్న కొన్ని పత్రికలు, ఛానళ్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆ ప్రచారాలను వలంటీర్లు, కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు.

ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి..

పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి టిడిపి పార్టీని చంద్రబాబు లాక్కున్నారని, అదే వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన మాట కోసం సోనియాను ఎదిరించి మగాడిలా సొంతంగా పార్టీ పెట్టి ప్రజల ఆదరాభిమానాలతో అధికారంలోకి వచ్చారన్నారు. అదే జగన్‌కు, చంద్రబాబుకు ఉన్న తేడా అని తెలిపారు.

వలంటీర్లకు తోడుగా ఉంటా

వలంటీర్లకు తాను కుటుంబ సభ్యుడిలా తోడుగా ఉంటానని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే రోజులలో వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్త, నాయకులకు లేని గౌరవం, విలువలు వలంటీర్లకు ఇస్తున్నారనే విషయాన్ని వలంటీర్లు గుర్తు పెట్టుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర కీలకంగా మారిందన్నారు. అనంతరం జెడ్పీటీసీ రమాదేవి, కో–ఆప్షన్ సయ్యద్ అమీర్, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు విజయ భాస్కర్, ఉప సర్పంచ్ రాజారెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, రమణయ్య, వెంకటరమణ, జనార్దన్‌రెడ్డి, గడ్డం ప్రభాకర్ రెడ్డి, మీరావలి, ఎంపీటీసీలు దస్తగిరి, జగన్‌మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్ నాయుడు, ఉపసర్పంచ్‌లు రాజారెడ్డి, సంజీవరెడ్డి, రఫీ, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, కొండ ప్రసాద్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, దుర్గయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు రామ్మోహన్ శెట్టి, మైనార్టీ నాయకులు చాన్ బాషా, జాకీర్, సాహెబ్, నబీ, బాబ్‌జాన్, బీసీసెల్ విజయ్ భాస్కర్, వైఎస్సార్ సిపి నాయకులు గజేంద్రరెడ్డి, రెడ్డయ్య రాజు, దప్పేపల్లి సిద్దారెడ్డి, అలీ బాషా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలో జరిగిన ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన డబ్ల్యూడీసీ – పీఎంకేఎస్‌వై 2.0 జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఉత్పాదక పెంపుదల నిధులతో మంజూరైన లక్కిరెడ్డిపల్లె మండలంలోని బి.ఎర్రగుడి డబ్ల్యూడీసీ ప్రాజెక్టు పరిధిలోని రైతులకు వ్యవసాయ సంబంధిత పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే స్ప్రింక్లర్లు, పీవీసీ పైపులు, ఆయిల్ ఇంజన్లు, తార్పాలిన్ పట్టలు, గడ్డి కత్తిరించే చాఫ్ కట్టర్లు తదితర పరికరాలను వాటర్ షెడ్ ద్వారా అందజేస్తామన్నారు. సబ్సిడీతో అందించే వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి రైతుకు పథకం లబ్ధి చేకూరేలా అధికారులు కృషి చేయాలన్నారు.

వలంటీర్ వ్యవస్థ ఒక విప్లవం

చిన్నమండెం : జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ పరిపాలనలో విప్లవానికి నాందిగా నిలిచిందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నమండెంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు పురస్కార ప్రదానం కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. 2 వేలు జనాభా దాటిన ప్రతి గ్రామానికి సచివాలయాన్ని తీసుకొచ్చి పరిపాలనను సరళీకరించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. రూ.2 లక్షల కోట్ల నిధులను వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించామన్నారు. సీఎం జగన్ తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి అన్నారు. అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి అందుతోందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఏజాస్ అలీఖాన్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, కోఆప్షన్ గౌస్‌సాబ్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, సర్పంచ్ ముసల్ రెడ్డి, ఎంపీటీసీలు రమేష్, శ్యాంచంద్ర, వెంకటప్ప నాయుడు, రెడ్డప్ప, రమణ, శ్రీరాములు, స్వామి, గంగులయ్య, సర్పంచులు నజీర్ అహమ్మద్, లక్ష్మీరెడ్డి, లోకేశ్వరరెడ్డి, జగన్నాథరెడ్డి, అప్రోజ్, సుధాకర్, దామోదర్, కళ్లు రమణ, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన వేరుశనగ విత్తనకాయలు



ఏఓ నాగరాణి

రామాపురం : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు 769 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు మంజూరైనట్లు ఏఓ నాగమణి తెలిపారు. గురువారం ఆమె మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వేరుశనగ విత్తనకాయలను ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. కె–6 రకం 424 క్వింటాళ్లు, నారాయణి రకం 345 క్వింటాళ్లు వచ్చాయని, 30 కేజీల బస్తా ప్రభుత్వ సబ్సిడీ పోనూ రైతులు కె–6 రకం రూ.1,670లు, నారాయణ రకం రూ.1,773లు రైతులు చెల్లించాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకానికి 3 చొప్పున రైతులకు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేశారు.

తాగునీటి కోసం అవస్థలు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో గత కొన్ని రోజులుగా తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కడప కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో గురువారం ఈఓపీఆర్డీ పులి రామ్‌సింగ్ క్షేత్రస్థాయిలో పరిశీలిన చేశారు. సోలార్ మోటర్ చెడిపోయి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తమకు తాగునీరు ఎప్పుడు అందిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. త్వరితగతిన మోటారుకు మరమ్మతులు చేయించి తాగునీరు అందిస్తామని ఆయన మహిళలకు తెలియజేశారు.

క్షయ వ్యాధిగ్రస్తులను మానవత్వంతో ఆదుకోండి



టీబీ రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న డా. కృష్ణ

రాజంపేట : క్షయ వ్యాధిగ్రస్తులను మానవత్వంతో ఆదుకోవాలని, అదే ప్రధానమంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్ ప్రోగ్రాం ఉద్దేశమని రాజంపేట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.ఎస్‌సీ కృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ రోగులకు ఆరు నెలలు పాటు దత్తత తీసుకునే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాను కూడా నలుగురు టీబీ రోగులను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. వీరికి చికిత్సతోపాటు మంచి బలవర్ధకమైన ఆహారాన్ని దాతల సహాయంతో అందిస్తామన్నారు. ఎంపీహెచ్‌ఓ అండ్ సీహెచ్‌ఓల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం తరపున ఆరు మంది క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు వికాస్, అశోక్, టీబీ సూపర్‌వైజరు జయప్రకాశ్, ప్రభుత్వ ఉద్యోగుల తాలుకా సంఘం అధ్యక్షుడు సిద్ధిరామయ్య, సిబ్బంది శివరాం, నీరజ తదితరులు పాల్గొన్నారు.

స్థల విషయమై ఘర్షణ

రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీ ఉడుంవారిపల్లెకి చెందిన షేక్ షకీలా బేగంపై అదే గ్రామానికి చెందిన షేక్ సలాం, సుబహాన్, మహమ్మద్ గౌస్‌లు బుధవారం రాత్రి ఇంటి స్థల విషయంపై దాడికి పాల్పడినట్లు గురువారం బాధితురాలు షకీలాబేగం అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. ఈ ప్రమాదంలో షకీలా బేగంకు చెయ్యి విరిగి తీవ్ర గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏటీఎం.. ఎనీ టైం మూతే



మూతపడిన ఏపీజీ బ్యాంక్ ఏటీఎం సెంటర్

రామాపురం : ఏటీఎం అంటే ఎనీ టైం మూతే అని మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి బ్యాంక్ ఏటీఎంని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు. వారంలో ఒక రోజు పని గగనమే అని వారు తెలిపారు. దీంతో అత్యవసర పరిస్థితిలో ఏటీఎం నుంచి నగదు రాక గత్యంతరం లేక బ్యాంకులలో వేచి చూస్తున్నారు. నగదు ఉపసంహరణను పక్కన పెడితే ఏటీఎం రిజిస్ట్రేషన్ కూడా పని చేయకపోవడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఇప్పటికైన బ్యాంకు అధికారులు చొరవ తీసుకొని ఏటీఎంను సక్రమంగా పనిచేసే విధంగా దృష్టి సారించాలని ఖాతాదారులు కోరుతున్నారు.

ప్రతి కుటుంబ సంక్షేమమే జగనన్న లక్ష్యం



సంక్షేమ బావుటాను అందిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల, అజయ్‌రెడ్డిలు

పెనగలూరు : రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిలు అన్నారు. గురువారం తిరుమలరాజుపేట, నడిమి సిద్దవరం, దిగువ సిద్దవరం, దళితవాడలు, పద్మాయగారిపల్లి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా మంచి స్పందన లభించింది. ఏ కుటుంబంలోనైనా సమస్య ఉంటే సంబంధిత అధికారిని పిలిపించి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. పింఛన్, విద్యుత్, గ్రామ సమస్యలు తదితర సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి అప్పటికే అధికారుల ముందే చర్చించి సమస్యను పరిష్కరించేలా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకతీతంగా, కులమతాలకతీతంగా సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికి రెండు, మూడు పథకాలు అందాయన్నారు. సంక్షేమం అందజేతలో మహిళలకు పెద్దపీట వేశామని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సలహా మండలి జిల్లా అధ్యక్షుడు పంజం సుకుమార్ రెడ్డి, ఎంపీపీ సిద్దవరం శ్రీనివాసులు రెడ్డి, సిద్దవరం సర్పంచ్ ప్రేమలత రెడ్డి, యువనాయకుడు వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్ రాజు, ఓజీ శ్రీనివాసులు రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, జెడ్పీటీసీ ఉదయగిరి సుబ్బరాయుడు, ఎంపీడీఓ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, చెంగల్ రెడ్డి, మల్లికార్జున, రాజ, శ్రీను, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

రాయచోటి అర్బన్ : కౌలు రైతులకు ప్రభుత్వం వెంటనే గుర్తింపు కార్డులివ్వాలని ఏపిరైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఆయన రైతులతో కలసి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కలిసి మాట్లాడారు. కౌలు రైతులు కష్టపడి పంటలు పండిస్తున్నా ప్రభుత్వం నుంచి వారికి తగిన గుర్తింపు లభించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే కౌలు రైతులను గుర్తించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు ఈమేరకు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆయన వెంట సీపీఐ నేతలు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, వెంకటేష్‌తో పాటు పలువురు రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన



స్పందన కార్యక్రమాన్ని నిర్వహించిన అధికారులు

సిద్దవటం : మండలంలోని టక్కోలి గ్రామ సచివాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం గురువారం సాయంత్రం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించామని రాజంపేట నియోజకవర్గం ప్రత్యేకాధికారిణి శ్రీలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలపై ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించామన్నారు. జగనన్న గృహ నిర్మాణ లబ్దిదారులు సూచించిన సమయానికి గృహాలను నిర్మించుకోవాలని తెలియజేశామన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవిలు ఇసుక మాఫియా, ఎర్రచెరువు మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని, ఎర్రచెరువు తవ్వకాల వల్ల పక్కనే ఉన్న భూముల్లోకి వర్షపు నీరు వస్తుందని దీంతో పంట పొలాలు దెబ్బతింటాయని, అంతేగాకుండా ఇసుక తవ్వకాలు జరిపి అక్రమ రవాణా చేయడం వల్ల పెన్నా నదిలో భూగర్భ జలాలు అడుగంటి పోతాయని ఈ సమస్యల పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డికి వారు అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ ఫణి రాజకుమారి, తహసీల్దారు శంకర్‌రావు, వ్యవసాయాధికారి రమేష్ రెడ్డి, ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వీఆర్‌ఓలు చలపతి, కేశవులు, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శివ, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆర్‌బికే సిబ్బంది, వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహంలో వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని జిల్లా పరిషత్ కాంప్లెక్స్‌లోగల ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, బీపీ, రక్తశాతం తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

'నేటి వలంటీర్లే రేపటి పాలకులు'



వలంటీర్ల సన్మాన సభలో ఎంపీపీ, నాయకులు

వీరబల్లె (రాయచోటి టౌన్): నేటి వలంటీర్లే రేపటి పాలకులని వీరబల్లె ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పెదివీడు గ్రామంలో వలంటీర్ల సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన పారదర్శకంగా సాగాలని వలంటీర్లను నియమించారని తెలిపారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి చేరవేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి, సంఘం వాండ్లపల్లె సర్పంచ్ స్వామి, సొసైటీ అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

గాలివీడు : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాల పట్ల ప్రత్యేక నిఘాను ఉంచినట్లు రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. మండల ఎస్‌ఐ వెంకటశివ ప్రసాద్‌తో మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టి అట్టివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అలర్లు, శాంతి భద్రతలకు భంగం కలించే వారిపై చర్యలు చేపట్టాలన్నారు. మండల పరిస్థితులను, పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సమయం పాటించకపోతే కఠిన చర్యలు

రాయచోటి అర్బన్ : సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది సమయం పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ హెచ్చరికలు జారీ చేశారు. గురువారం ఆయన పట్టణంలోని వాల్మీకీ వీధి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది హాజరుతోపాటు పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున తోపాటు పలువురు సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

వడగండ్ల వానకు దెబ్బతిన్న తోటలు

ఓబులవారిపల్లె : మండలంలోని బోటిమీదపల్లె, యల్లాయపల్లె, పెద్దఓరంపాడు గ్రామాల్లో బుధవారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు అరటి, బొప్పాయి, తమలపాకు తోటలు దెబ్బతిన్నాయి. గురువారం ఉద్యానవన శాఖ అధికారులు దెబ్బతిన్న తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారిణి ఆషియా మాట్లాడుతూ వడగండ్ల వాన కురవడంతో బొప్పాయి 50 ఎకరాల్లో, అరటి 45 ఎకరాల్లో, తమలపాకు తోటలు నాలుగు ఎకరాల్లో దెబ్బతిన్నాయని చెప్పారు. పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోండి



సమస్యలపై కలెక్టర్‌తో చర్చిస్తున్న కొరముట్ల, నాయకులు

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు నష్టపోయిన అరటి, బొప్పాయి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కోరారు. గురువారం సాయంత్రం రాయచోటి జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ అజయ్‌రెడ్డిలు కలెక్టర్ గిరీషా పీఎస్‌తో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ అకాల వర్షాలకు, ఈదురుగాలులకు పుల్లంపేట మండలంలో 385 ఎకరాలు, రైల్వేకోడూరులో 76 ఎకరాలు, ఓబులవారిపల్లె మండలంలో 6 ఎకరాలు, చిట్వేలి మండలంలో 45 ఎకరాలు అరటితోట దెబ్బతిందని దాదాపు 250 మంది రైతులు నష్టపోయారని, దీంతో రూ. 5.48 కోట్లు పంటనష్టం వాటిల్లిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో నష్టపోయిన రైతులను గుర్తించి వెంటనే ప్రభుత్వానికి నివేదికలు పంపి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2021 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు చెయ్యేరు నది పరివాహక ప్రాంతమైన పెనగలూరు మండలం దిగువ సిద్దవరం దళితవాడ ముంపు వాసులను సురక్షిత ప్రాంతంలో పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. అనంతరం నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.